# ఆవకాయా-అమ్మాయీ

## పణతుల రామచంద్రయ్య

జనతా పొగలు కక్కుకుంటూ వచ్చి స్టేషన్లో ఆగింది. కాలి నుసైపోయిన బొగ్గు విసర్జించి, కొత్త బొగ్గు వేసుకుంది. చాలా దూరంనుంచి వస్తున్న పాత ప్రయాణీకుల్ని కొందర్ని దింపేసి, కొత్తవాళ్లను ఎక్కించు కుంది.

"దవనామ్-చామంతిపూల్"

రైల్వేస్టేషన్ యాసలో అరుస్తున్నాడొక పూలమ్మే కుర్రాడు. ఇంకా టీ, కాఫీ, ద్రాక్ష, సోడా, పిప్పరమెంట్లు, సిగరెట్లు, పేపర్లు—ఇంకా సకలవస్తువులవాళ్లూ రైలు పొడుగున అటూ యిటూ తిరుగుతు న్నారు. విజయవాడ స్టేషను మహా కోలాహ లంగావుంది.

కాంతారావు రొప్పుకుంటూ పరుగెత్తు కొచ్చి సెకండ్ క్లాసులో కూచున్నాడు. వెనక కూలీ తెచ్చిన పెట్టె, బెడ్డింగూ, జాడీ అన్నీ సాయంపట్టి బెంచీకింద సర్దేయిం చాడు. బెంచీకింద అంతా అశుభ్రంగా వుంటుందని తిరిగి జాడీని పైబెర్తుమీద పెట్టించాడు. కూలీ డబ్బులు పుచ్చుకుని వెళ్లిపోయాడు.

వాచీ చూసుకున్నాడు కాంతారావు. మూడూనలభయి. ఇంకా ఐదు నిముషాలు టైముంది. తను గాభరాపడి తొందరగా పరుగెత్తాడు. మరేంచేస్తాడు? మామయ్య టైమైపోతోందని ఒకటేగోల. అత్తయ్యేమో ఎంతకూ తెమలనీదు. ఆ జాడీ పార్శిలు చేస్తూ కూచున్నది-కొత్తావకాయిజాడీ!

నాయనమ్మ ఆవకాయంటే పడిఛస్తుంది. అందులోనూ రాజమ్మత్తయ్యపెట్టిన కొత్తావ కాయంటే చెవులు కోసుకు మరీ ఛస్తుంది. మొన్న కృష్ణపుష్కరాలకు వొచ్చినప్పుడు పెట్టి పంపమని చెప్పి వెళ్ళిందట. ఈవిడ కొసరి కొసరి పెట్టిపంపిస్తోంది: మధ్యను ఈ జాడీని రిక్షాలోంచి దింపలేకా, రైల్లో ఎక్కించలేకా తన తాడు తెగిపోతోంది.

ఒక్కసారి పైబెర్తుమీద బైఠాయించిన జాడీకేసి చూశాడు. ఆనందకరంగా ఆవ కాయి పరిమళం ఘుమాయిస్తోంది. అంచు ల్నించీ కారిన వూటతో కట్టుకట్టిన గుడ్డ అంతా మరకలైవుంది. ఆ పరిమళం మరింత ఘాటుగాపెట్టెఅంతా ప్రసరించింది. పెట్టెలో అతడు తప్ప మరెవ్వరూ లేరు.

కాంతారావు చేతిలోని సినిమాపత్రిక తిరిగేయటం ప్రారంభించాడు.

ఇంతలో గబగబా పెట్టెలోకి వచ్చింది ఓ అమ్మాయి. వచ్చి, కాంతారావుకు పక్కనే తన పెట్టెవుంచి ఎదురుగా కూచుంది.

పత్రికలోంచి తలెత్తిన కాంతారావు ఆశ్చర్యపోయాడు. ఆ అమ్మాయి ఎవ్వరో కాదు. తన క్లాసుమేటు పద్మజ! కాలేజీకి వొచ్చేటప్పుడూ, పొయ్యేటప్పుడూ పది హేనుమంది సఖులతో పరివేష్టించి నడుస్తూ 'మిస్ కాలేజి' అని పేరందిన పద్మజ!

గార్డు విజిలువేశాడు. రైలు కదిలింది.

అతడు ఒక్కసారి తన అమెరికన్ జాకెట్టువంకా, సైకిలర్ ప్యాంటువంకా చూసుకున్నాడు. "ఫ్లీ మోతగా వున్నాయి!" అనుకున్నాడు. ఆమెకేసి చూశాడు. వాచీకి కీ యిస్తోంది.

ఆవిడను పలకరించడమా? మానటమా? అనుకున్నాడు. పలకరిస్తే ఏమనుకుంటుందో ఒకవేళ, పలకరించకపోతే—"ఈ కుర్రాడి కేం మేనర్సు లేవే!" అనుకోదూ. ఎంత ఇన్సల్టు; ఫైనలియరు చదువుతున్న తనకు మేనర్సు లేవనిపించుకోవటం!

కాంతారావిలా ఆలోచనల్తో కొట్టు మిట్టాడుతుంటే ఆ అమ్మాయే అడిగింది ఇంగ్లీషులో—

"ఎక్కడికండీ?" అని.

"ఎబ్బే, తెనాలికండీ!" తెలుగులో జవా బిచ్చాడు.

యూనివర్సిటీకోర్సంతా తెలుగులోనే సాగాలని కాలేజీ డిబేటులో ఏకధాటీగా ఉపన్యసించాడొకసారి కాంతారావు. అది పద్మజకూ తెలుసు. అందువల్ల మెల్లగా ముసి ముసిగా నవ్వుకుంది.

"ఏదీ, ఆ పత్రికొకసారి యిలా యిస్తారా?" అని, కాంతారావు ఇవ్వటం కోసం ఎదురు చూడకుండానే అతడి చేతుల్లోవున్న పత్రిక తీసుకుంది. ఆ సమయ ములో ఆమె చేతుల్లోని విద్యుచ్ఛక్తి ఆ పత్రికద్వారా ఒక్కక్షణంపాటు కాంత రావులో ప్రవహించింది. అతడు ఆ పత్రి కను మనసులోనే స్తుతించాడు. తాను కొని పెట్టిన అర్ధరూపాయిలో ప్రతి నయాపైసా సద్వినియోగమయింది!

కాని మరుక్షణంలోనే ఆ పత్రికమీద అతడికి ఎక్కడలేని కోపం వచ్చేసింది. ఈ పత్రిక లేకుండావుంటే, ఆమె తనతో ఆ మాటా ఈమాటా మాట్లాడుతూ, నవ్వుతూ వుండునుకదా! ఈ నడమంత్రపు పత్రిక దానికి అడ్డు వచ్చింది. అందులోనూ సినీ పత్రిక. దాంట్లో ఆమూలనుంచి ఈమూల దాకా చదివేవరకూ ఆవిడ తలెత్తే అవ కాశంలేదు. అంతవరకూ తాను దిగులుగా కూచోక తప్పదుకదా. దుర్విధి!

కాంతారావు హృదయం చీకటయింది. "సరే ఏం చేద్దాంలే, గతంగతః" అను కున్నాడు. ఈలోపల తన క్రాఫూ, కాలరూ కాస్త సరిచేసుకుందామని ఆ పని పూర్తి చేసుకున్నాడు. గుండె జారుమంది.

లక్షణంగా కూచుని కాలరు సర్దుకుం టున్న మనిషికి గుండె జారుమన్న చందమూ అంటే, ఆ సమయంలో అతడికి పైబెర్తుమీద పరిమళాలు చల్లుతున్న తన ఆవకాయి జాడీ జ్ఞప్తికొచ్చింది. భయమూ, అవమానమూ కలి గాయి.

పత్రికమీది కోపం కాస్తా జాడీలోని ఆవకాయిమీది కోపంగా మారింది. దీని ముఖంమండా! దీనికెంత పొగరు! రాజమ్మ త్తయ్య హస్తవాసివల్ల సంక్రమించిన రుచీ, పరిమళమూ తనలో వుంటే వుండవచ్చుగాక! అంతమాత్రంచేత ఇలా ఘుమాయిం-చి పోతుందా. ఒకవేళ ఘుమాయించినా— తను 'మిస్ కాలేజి' పద్మజవంటి కల్చర్డ్ లేడీతో మాట్లాడుతున్నప్పుడా? దీన్ని— మింగెయ్యా!

కాని ఆవకాయి పరిమళం తీవ్రతరమౌ తోంది. "ఏది కోపం నన్నేంచేస్తుంది పోదూ" అనుకున్నట్టుంది అది!

కాంతారావు వుడికిపోతున్నాడు. కుమిలి పోతున్నాడు. ఆ వాసన, తలొంచుకుని పత్రిక చదువుకుంటున్న పద్మజకు సోకితే? ...ఇంకేమన్నా వుందా!...ఆమె తలెత్తి ఏమిటని అడిగితే?...ఏం చెప్పాలి?...పైకి చూసి, ఆ జాడీ ఎవరిదని అడిగితే? ... తన

# ★ అవకాయీ - అమ్మాయీ ★

దని చెప్పగలడా? అంతకంటే ఆత్మహత్య ఎన్నుకోదగ్గది.

అతడి అవస్థ చెప్పతరంకాదు. పద్మజ పత్రిక చదవటం పూర్తయింది. ఆవిడ దృష్టిని అవకాయ వాసననుంచి దూరంచెయ్యాలని, అతడే సంభాషణ కొనసాగించాడు.

"మరి మీరేవూళ్లో దిగుతారన్నారు?"

"కావలి."

తర్వాత ఏమడగాలో తోచలేదు. నీళ్లు నములుతూ కూచున్నాడు.

రెండుమూడు స్టేషన్లు దాటిపోయాయి. తెనాలి సమీపించబోతున్నది. కాంతారావు గుండె దడగా కొట్టుకుంటున్నది. ఏక్షణాన ఆవిడనోటినుంచి "ఆఆకావకాయిజాడీ..?" అన్న ప్రశ్న శూలమై వస్తుందో......!

ఆ భయంలోనే సంభాషణ సాగించాడు.

"మరి కావలిలో మీ రిలెటివ్స్ ఎవరైనా......?" అన్నాడు.

"అబ్బే. రిలెటివ్స్ ఎవరూ లేరండీ. అక్కడ మా స్నేహితురాలు అరుణ వుంది. ఇంటర్ పూర్తికాగానే ఆ అమ్మాయికి పెళ్ళయింది లెండి. "ఈ దసరా సెలవుల్లోనైనా వచ్చిపోకుంటే మీకూ మాకూ ఇంతటితో సరి"—అంటూ వాళ్లు భార్యాభర్తలిద్దరూ చాలా నిష్ఠూరంగా జాబులు రాశారు. అందువల్ల ఓమారు వెళ్ళి చూసొద్దామని వెళుతున్నానండీ."

'శుభం' అనుకున్నాడు కాంతారావు. ఆ స్నేహితురాలితో కావలిలోనే వుండవేల? వుండెను పో, ఈమెను రమ్మని వ్రాయనేల! వ్రాసెను పో, యీవిడ బయలేరనేల? బయల్దేరెను పో, ఈ బండిలోనే ఎక్కనేల? ఎక్కను పో—

కాంతారావు స్వగతం 'టక్కున కట్' అయింది, పద్మజ ప్రశ్నతో.

"అబ్బ! ఎక్కడిదండీ అవకాయ వాసనా?" పడింది పిడుగు!

ఆ ప్రశ్న సరిగా వినబడనివాడికిమల్లే, "ఏమిటండీ?" అన్నాడు.

ఆ అమ్మాయైనా, కాంతారావుకు వినబడలేదేమోలే పాపం - అని మరోకసారి చెప్పి చూడవచ్చునా? ఊహూ, ఏదో అవసర మున్నట్టు తల పైకెత్తి చూచింది. ఇవతల కాంతారావు తన్నుకుంటున్నాడు. ఈ అవస్థ ఆ అమ్మాయి (అమ్మాయికాదు ఆడశక్తి—ఇది కాంతారావు భావం) గమనిస్తేనా?

తలెత్తిచూసి "ఎవరిదండీ ఆ అవకాయ జాడీ?" అంది.

కాంతారావు నెత్తిన మరోపిడుగు! అతనికి మండిపోయింది. ఎవరిదైతే యీ మనిషి కెందుకంట? ఈ అమ్మాయిని ఏఅభాగ్యుడు చేసుకుంటాడోగాని, వాడు పెళ్లయినమూడోనాడే సన్యాసం స్వీకరిస్తాడు. నిజం!

మరుక్షణంలోనే తెప్పరిల్లుకుని తడుముకోకుండా జవాబిచ్చాడు: "ఏమోనండీ! తెలీటంలేదు. రైలెక్కినప్పట్నుంచీ చూస్తున్నాను. అదక్కడేవుంది. ఒకటేవాసన. ఎవరు పెట్టి మరిచిపోయి వెళ్లారో పాపం!"

పద్మజ సీరియస్‌గా ముఖంపెట్టింది.

"పాపమేం లెండి. అలాంటివాళ్లను పాపం అనకూడదు. లేకపోతే, మొహం వాచినట్టు—ఈ అవకాయజాడీలు నెత్తినేసుకురావటం దేనికి? తెచ్చారే పో, దాన్ని కుర్తుగా దింపుకోరూ?" అన్నది.

వీపుమీద ఎవరో కొరడాకొసతో చురక వేసినట్టయింది కాంతారావుకు! ఈవిడ అనే మాటలన్నీ పొల్లుపోకుండా తనకేవచ్చి తగులున్నయ్. తగిలినా యేం చేయగలడు, తేలు కుట్టినదొంగ? నోరు మూసుకుని ఆ మాటలన్నీ భరించాడు. ఏ మాట కాదన్నా ప్రమాదమే. ఒక వేళ తను తొందరపడి అడ్డుతగిలి "మరీ అలా అనకండి పాపం. పొరబాటనేది అందరికీ వుంటుంది," అంటాడనుకో, ఇక యీవిడకు వేరే చెప్పనవసరంలేదు, ఆ జాడీ తనదేనని. అప్పుడెంత అవమానం ... పరువు పోతుందని, తానిట్లా జాడీ తనది కాదని అబద్ధంచెప్పినట్లు ఈవిడకు తెలిస్తే శివశివా! ఇక తను బతికేంలాభం?

కుక్కిన పేనల్లే వూరుకున్నాడు.

ఆవిడ అన్నది: "మరీ ఇంత మతిపరువు మనుషులుకూడావున్నారా అని ఆశ్చర్యం వేస్తుందండీ! వాళ్ళబండబడ."

కాంతారావుకి మతిపోతున్నది. ఎంత దుర్గతిపట్టింది తనకి! పద్మజచేత ఇలాంటి మాటలు తినవలసివస్తుందని తను కలలోనైనా అనుకున్నాడా?

"ఏమోనండీ" అన్నాడు నవ్వుతూ, ఇక ఆమాత్రమైనా మాట్లాడకుంటే బావుండదని - ఆమాత్రమైనా నవ్వకుంటే మర్యాదకాదని.

మళ్లీ అందుకుంది:

"ఛా!ఛా! ఇటువంటివాళ్లుకూడా దేశంలో వున్నారంటే—"

ఏంవుంటేం? ఈవిడకెంతుపద్రవం? ఈవిడ ఓపట్టాన పోనిచ్చేటటులేదేయీవిషయాన్ని!

సమాధానంగా మళ్లీ ఓచవటనవ్వు నవ్వాడు.


"ఏమంటారు?" అంది పద్మజ, అతడు ఆలోచిస్తుండటం చూసి, సమాధానంకోసం డిమాండ్ చేస్తూ. కాని అతడుమాత్రం ఏమంటాడు?

విసుగుకనబరుస్తూ, "పోనిద్దురూ! పిధవ అవకాయి ఎలాపోతే మనకెందుకు?" అన్నాడు, ఇకనైనా ఆ ప్రసక్తినుంచి విడుదల కలుగుతుందని.

కాని అతడు విడుదలపొందటం పద్మజకిష్టంలేదు! "అలాగంటారేం?...అవకాయ మీకిష్టంలేదా?" అని అడిగింది.

"ప్చ్! ఇష్టమేమిటిలెండి! ఏదో నాటికొకరోజు వేసుకుంటాను. అసలీ అవకాయ, గేజకాయి, ఇలాంటివి మా యింట్లో చెయ్యటమే చాలా అరుదు. అయినా యేం రుచండీ, యీ అవ్వకాలపు వంటకాలన్నీ? ఏదో ముసలాళ్ళకొక్కాని—" అన్నాడు.

"అలా తీసెయ్యకండీ మరి! అంటూంకాని



ఆవకాయిలో ఎంత స్పిరిట్ వుందని...అసలు తెలుగుదనమంతా దాంట్లోనే వుందేమోనని నా అభిప్రాయం. నామట్టుకు నాకు ఆవకాయంటే చాలాయిష్టం సుమండీ!"

గుండె ఆగినంత పనైంది అతడికి! కాదూ మరి? పద్మజ - మిస్ కాలేజీ పద్మజ - ఆవకాయనుగురించి ఇలా అంటుందని అతడనుకున్నాడా?

చాలా పశ్చాత్తాపపడ్డాడు కాంతారావు. పద్మజకు ఆవకాయ ఇష్టమని తెలిసుంటే, తను ప్లెయిన్‌గా ముందే, ఆ జాడీ తనదేనని చెప్పివుండునుకదా! ఎంతపని జరిగింది? తీరా యిప్పుడేమనుకుంటే యేం లాభం, చేతులుకాలాక! సమయం మించిపోయింది.

ఇప్పుడు చెబితే, ఆ జాడీతనదేనని...ఛా. తలకాయ కొట్టేసినట్టయిపోదూ? ఈవిడ యీ సంగతి తీసుకుపోయి, కాలేజీలో లేడీస్‌రూం అంతా దండోరా వెయ్యదని నమ్మకమేమిటి?

పోనీ, మరోరకంగా, "ఎవరో వుంచి వెళ్ళారు కాబట్టి దాన్ని నేనన్నా తీసుకు వెడతాను" అని చెప్పి తీసుకుపోతే?

ప్చ్!...బాగుండదు. వీడికింత కక్కుర్తి ఏమిటూ అనుకోదూ! కాంతారావు మనస్సులో ఝంఝూమారుతం చెలరేగుతోంది.

పద్మజ అటు తిరిగి చూస్తోంది రైలు శరవేగంతో పరుగెడుతోంది. ఆ వేగంలో గాలిహోరుకు పద్మజ ముంగురులు లేచి అటు యిటూ కదుల్తున్నయ్.

తెనాలి స్టేషను సమీపిస్తున్నది.

పద్మజ ఇటు తిరిగి అంది: "ఆ జాడీ ఎవ్వరికీ కాకుండా ఇలా పాడైపోతే బాగుండదండీ. దాన్ని ఏం చేద్దాము?"

అతడికి కొద్దిగా ఆశకలిగింది. ఇప్పుడైనా "నే తీసుకెడతా"నని చెబుదామా అనుకున్నాడు. కాని ధైర్యం చాలలేదు.

"మీరు సందేహిస్తున్నారు కాబట్టిదాన్ని నేనన్నా తీసుకువెడతాను. ఎటూ నేను స్నేహితురాలింటికి వెడుతున్నాను; ఛాన్స్‌గా దొరికిన ఆవకాయని తీసుకెళ్ళి వాళ్ళకన్నా ప్రెజంట్ చేస్తాను. వాళ్లింట్లో ముసలాళ్ళుకూడా వున్నారు. ఇంతకష్టపడి తీసుకుపోయి ఇస్తే వాళ్ళన్నా తీసుకోక పోరు" అన్నది పద్మజ.

ఇందులో ఒక్కొక్క మాటా కాంతారావు గుండెల్లో శూలంగా గుచ్చుకుంటున్నది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ఏమిటీ ఘోరం? నాయనమ్మకోసం అత్తయ్య ప్రీతితో పెట్టిఇచ్చిన ఆవకాయ...ఈవిడ గద్దలాగా తన్నుకుపోతున్నదే. ఇప్పుడేమిటి చెయ్యటం?... ఈవిడగారికి జాడీని ధారపొయ్యటం తప్ప గత్యంతరం లేదా?—

లేదు.

"ఏమిటండీ, అలా ఆశ్చర్యపడుతున్నారు? ఈవిడేమిటి, ఈ జాడీ మోసుకుపోవడమేమిటి, అని ఆశ్చర్యంగా వుందా? నాకు అలాంటి చిన్నతనమేమీ లేదులెండి. ఎంతగా బోస్‌లోవున్నా—కాలేజీలో చదువుతున్నా—మేంకూడా నలుగురితో బాటూ ఉప్పూ, అన్నం తినేవాళ్ళమే" అంది పద్మజ.

దీనికేమని జవాబు చెబుతాడు పాపం, కాంతారావు? దైవోపహతుడు!

"భ భ. అది కాదండీ. ఎవరు మాత్రం ఉప్పూ, అన్నం కాక మరేం తింటారులెండి. అందులో నిక్షేపంలాంటి కొత్తావకాయ."

"పోనీ మీరు తీసుకు వెళ్ళాలని వుంటే తీసుకుపొండి. నాకేం అభ్యంతరం లేదు. ఎటొచ్చీ పరాయివాళ్ళపాలు కాకుండా మనలో ఎవరో ఒకరు తీసుకెళ్ళడమే ముఖ్యం."

"ఎబ్బే. నాకెందుకండీ. అందులోనూ యిప్పుడు నాకెక్కడ కుదురుతుంది తీసుకుపోయేందుకు. అసలే గాడిదబరువుంది నాకు. దానికితోడు ఇదొకటా? నాకెంత మాత్రమూ అక్కర్లేదు బాబూ, మీరే తీసుకువెళ్లండి."

ఈ మాటలు అంటున్నప్పుడు చూడాలి కాంతారావు ముఖం. దొరక్క దొరక్క పద్మజతో మాట్లాడే అవకాశం దొరికితే అది సద్వినియోగం కాకపోయెనేఅన్న విచారం- పదిలంగా మోసుకుపోతున్న ఆవకాయిజాడీ తనకు కాకుండాపోతున్నదే అన్న ఏడుపూ- ఇంటికివెళ్ళాక నాయనమ్మకు దీన్నిగురించి ఏం సంజాయిషీ యిచ్చుకోవాలన్న దిగులూ కలిసి అతడి ముఖాన్ని నయాపైసా అంత చేసి పారేశాయి.

చివరకు పద్మజ అంది: "ఆఖరుకు నాకే తోసేశారన్నమాట దీన్ని. సరే కానివ్వండి," కాంతారావుకు అరికాలిమంట నెత్తికెక్కుతోంది. ఈవిడ దీన్ని తీసుకుపోలేదని ఎవడేడిశాడు? అప్పనంగా తన జాడీని తీసుకుపోతున్నది కాక మళ్ళీ మాట్లాడుతోంది — తనకేదో తప్పనిసరైనట్టు.

"ఐతే ఓ సాయంచేసి పెట్టండి. కాస్త యీజాడీని, యీ పేపర్లలో చుట్టి నా పెట్టెలో సర్దిపెడుదురూ, మీకు పుణ్యముంటుంది! దీన్ని విడిగా ఎక్కడ మోసుకుపోను! ఎవరేనా చూసినా అసహ్యంగా వుంటుంది కూడా" అంది పద్మజ.

"ఓ, దానికేం?" అన్నాడు తెచ్చిపెట్టుకుని నవ్వుతూ. ఆనవ్వు నవ్వేందుకు అతడు చాలా బాధపడవలసి వచ్చింది.

పద్మజ పెట్టె తెరిచింది. కాంతారావు ఆవకాయి జాడీని జాగ్రత్తగా కాగితాల్లో ప్యాక్ చేసి ఆపెట్టెలో సర్దాడు. అతడికాసమయంలో భర్తృహరి సుభాషితాల్లో పద్యం గుర్తొచ్చింది; "ఎవ్వరిసొమ్ము కెంతదిన నెవ్వరికున్నదో ప్రాప్తి..."పద్మజ థాంక్స్ చెప్పింది.

అతడికి ఏడుపొచ్చింది. "అయ్యో! ఈ చేతుల్తోనే అత్తయ్య చేతుల్లోంచి జాడీ అందుకున్నాను. ఈ చేతుల్తోనే మోసుకొచ్చాను. ఈ చేతుల్తోనే నాయనమ్మచేతి కందిద్దామనుకున్నాను. కాని...ఈ చేతుల్తోనే యీదెయ్యం (మిస్ పద్మజ!) పెట్టెలో సర్దివేశాను. ఇంతకన్నా దారుణం ఇంకేమన్నా వుందా?" అనుకున్నాడు.

తెనాలి సేషను వొచ్చింది. పూర్ణిమనాటి సముద్రంలాగా కల్లోలంగా వున్నయ్ తెనాలిస్టేషనూ, కాంతారావు హృదయమూ.

"వస్తానండీ గుడ్‌బై," అని పద్మజతో చెప్పి, ఆవిడ నవ్వుతూ యిచ్చిన వీడ్కోలును ఏడుస్తూ పుచ్చుకుని, పెట్టేబెడ్డింగూ రెండు చేతుల్తో పట్టుకుని బండి దిగాడు కాంతారావు.

గార్డు ఈలవేశాడు. రైలుకదిలి వెళ్లిపోయింది. పెట్టేబెడ్డింగూ దగ్గరపెట్టుకుని, వెళ్ళిపోయే రైలువేపుచూస్తూ అలాగే నిల్చుండిపోయాడు కాంతారావు. ★

